క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు టీఎన్‌జీవోస్ ఫేస్–2, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు టీఎన్‌జీవోస్ కాలనీ ఫేజ్–1, ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రశాంతిహిల్స్, రాయదుర్గం, రాయదుర్గం పోలీస్ స్టేషన్, ఓరియన్ విల్లాస్, బయో డైవర్సిటీ పార్క్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలో...

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ ఫీడర్ పరిధిలో ఇంద్రారెడ్డి ఆలివ్‌న్ కాలనీ, సప్తగిరి కాలనీ, బీహెచ్ఈఎల్ హెచ్ఐజీ, మంజీరా పైప్‌లైన్ రోడ్డు, మైత్రీనగర్ ఫేజ్ 1,2,3, ప్రకాష్‌నగర్, వినాయక్‌నగర్, గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ, సాయిరాం టవర్స్, వైశాలీనగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైశాలీనగర్ ఫీడర్ పరిధిలో వైశాలీనగర్, ఉషోదయ ఎన్‌క్లేవ్, మంజీరా పైప్‌లైన్ రోడ్డు, ఏపీఎన్‌జీఓ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అథర్ షఫియాకు పీహెచ్‌డీ



రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని పరిశోధక విద్యార్థిని అథర్ షఫియాకు పీహెచ్‌డీ డిగ్రీని ఆదివారం ప్రకటించారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని మేనేజ్‌మెంట్ విభాగంలో అథర్ షఫియాకు ఈ డిగ్రీని ప్రకటించారు. ఆమె 'క్వాలిటీ ఆఫ్ వర్క్ లైఫ్ అండ్ ఎమోషనల్ లేబర్ అమాంగ్ ఎయిర్‌హోస్టెస్‌లు: ఏ స్టడీ ఆఫ్ సెలెక్ట్ ఎయిర్‌లైన్స్ ఇన్ ఇండియా'అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించారు. ఆమె మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ విభాగంలో ఫ్యాకల్టీ డాక్టర్ షేక్ కమ్రుద్దీన్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆమెను పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలి



రాడిసన్ హోటల్‌లో జాతీయ జెండాలతో బీజేపీ నాయకులు

గచ్చిబౌలి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిఒక్కరూ జాతీయ జెండాను ఇంటిపై ఎగురవేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు గజ్జెల యోగానంద్ పిలుపునిచ్చారు. ఆదివారం గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో 'హర్ ఘర్ తిరంగా'కార్యక్రమంలో జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ భాగంగా ప్రతి భారతీయుడిలో దేశభక్తి భావాన్ని ప్రేరేపించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి భారతీయుడికి త్రివర్ణ పతాకంతో భావోద్వేగ అనుబంధం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ సెంట్రల్ కో ఆర్డినేటర్ , సుప్రీంకోర్టు న్యాయవాది బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో వాగ్గేయకార సౌరభం



మాదాపూర్: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ వాణీ మ్యూజిక్ అకాడమీ మాదాపూర్‌లోని మల్లన్న ఆలయంలో ఆదివారం వాగ్గేయకార సౌరభం (సంగీత) కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఎర్రగొల్ల శ్రీనివాస్ యాదవ్, డాక్టర్ నర్రా సుఖేందర్‌రెడ్డి అతిథులను ఘనంగా సత్కరించారు. రాగం సతీష్‌యాదవ్, బ్రహ్మకుమారీస్ చంద్రరేఖ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

పటాన్‌చెరు టౌన్: యాదవ సంఘం పట్టణ అధ్యక్షుడిగా దేవయ్య యాదవ్ నియామకమయ్యారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎన్నిక నిర్వహించినట్లు ఆ సంఘం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా దేవయ్య మాట్లాడుతూ.. యాదవ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్, మాజీ కార్పొరేటర్ శంకర్, మాజీ అధ్యక్షుడు వెంకటేష్, మల్లేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్లకు మోక్షం



నల్లగండ్ల హుడా కాలనీలో వేసిన సీసీ రోడ్డు

శేరిలింగంపల్లి: జీహెచ్ఎంసీ పరిధిలోని శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా మార్చేందుకు చర్యలు చేపట్టారు. సర్కిల్‌లోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, భారతీనగర్ డివిజన్లలోని కాలనీలు, బస్తీల్లో అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా మార్చే పనులను ప్రారంభించారు. ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు షేక్ హమీద్‌పటేల్, గంగాధర్‌రెడ్డి, రాగం నాగేందర్ యాదవ్, సింధు ఆదర్శ్‌రెడ్డి పర్యవేక్షణలో జీహెచ్ఎంసీ అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టడంతో సీసీ రోడ్ల పనులు చురుకుగా సాగుతున్నాయి. ఇప్పటికే పలు సీసీరోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే, కార్పొరేటర్లు అధికారుల సమక్షంలో శంకుస్థాపనలు చేయగా అందులో కొన్నింటిని నిర్మాణం ఇప్పటికే పూర్తయ్యాయి. మరికొన్ని పనులు సాగుతుండగా, ఇంకా పనులు సాగించాల్సినవి కూడా ఉన్నాయి.

గచ్చిబౌలిలో అత్యధికంగా సీసీ రోడ్ల నిర్మాణం..

- శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో 2023 జనవరి నుంచి ఇప్పటి వరకు మొత్తం 56 సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.20.65 కోట్ల విలువ చేసే పనులను చేపట్టారు.
- అందులో అత్యధికంగా గచ్చిబౌలి డివిజన్‌లో 20 సీసీ రోడ్లు చేపట్టగా వాటి విలువ రూ.688.00 లక్షలు కాగా, ఆ తర్వాత అతి తక్కువగా భారతీనగర్ డివిజన్‌లో నాలుగు సీసీరోడ్లకు రూ.103.00 లక్షల పనులను చేపట్టారు.

- దశలవారీగా అన్ని అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా మార్చడమే లక్ష్యం
- సర్కిల్ పరిధిలో సుమారు రూ.20 కోట్లతో సీసీరోడ్లు

ఇప్పటి వరకు చేపట్టిన సీసీరోడ్ల వివరాలు..

డివిజన్	చేపట్టిన రోడ్లు	మొత్తం విలువ
కొండాపూర్	17	రూ.643.00 లక్షలు
గచ్చిబౌలి	20	రూ.688.00 లక్షలు
శేరిలింగంపల్లి	15	రూ.631.50 లక్షలు
భారతినగర్	04	రూ.103.00 లక్షలు

ఇంకా చేపట్టాల్సినవి..

- ఖాజాగూడలోని పీజేఆర్‌నగర్, రాయదుర్గం, గాలిదొడ్డి, కేశవనగర్, ఖాజాగూడ, సాయిఐశ్వర్యకాలనీ, సాయివైభవ్‌కాలనీ, మధురానగర్, ప్రశాంత్‌హిల్స్ వంటి ప్రాంతాల్లో మరిన్ని చోట్ల చేపట్టాల్సిన అవసరం ఉంది.
- ఈ ప్రాంతాల్లో ప్రధాన రోడ్లను విస్తరించడం, లింకురోడ్ల నిర్మాణంతో అవి కాస్తా ఆకర్షణీయంగా మారగా, వాటికి చేరువలోని బస్తీల్లో అంతర్గత రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారిపోయింది.
- కొన్ని చోట్ల సీసీ రోడ్లు వేసినా వాటిపై మ్యాన్‌హోళ్లు పొంగి మురుగునీరు సీసీరోడ్లపై పారుతున్నవి కూడా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా మారుస్తాం..



శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీల్లో అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా మార్చే ప్రక్రియ సాగుతోంది. 2023 జనవరి నుంచే రూ.2065.50 లక్షలతో 56 సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నాం. ఇప్పటికీ ఇంకా కొన్ని చోట్ల నిర్మాణం చేయాల్సి ఉంది. వాటన్నింటికీ ప్రతిపాదనలు చేస్తున్నాం. నిధుల మంజూరును బట్టి సీసీరోడ్ల నిర్మాణం చేస్తాం. ప్రజలకు తమ పరిధిలో అంతర్గత రోడ్లని సీసీరోడ్లుగా మార్చేందుకు చర్యలు చేపట్టి వారికి ఇబ్బందులు లేకుండా చేస్తాం.

–శ్రీనివాస్, ఈఈ, శేరిలింగంపల్లి సర్కిల్

అన్ని అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా మార్చాలి..



అన్ని కాలనీలు, బస్తీల్లోని అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా మార్చాలి. అంతేకాకుండా సీసీరోడ్ల నిర్మాణం చేసిన తర్వాత వాటిపై ఉండే మ్యాన్‌హోళ్ల ద్వారా మురుగు నీరు రోడ్లపై పారకుండా చర్యలు చేపట్టాలి. రోజూ వీటిపై శుభ్రం చేసేలా కూడా చర్యలు తీసుకోవాలి. అంతర్గత రోడ్లు బాగుంటేనే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ రోడ్లపై వీధిదీపాలు కూడా వెలిగేలా చర్యలు చేపట్టాలి.

– రామస్వామియాదవ్, కన్వీనర్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మియాపూర్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తీశ్రీనగర్ కాలనీలో ఉషోదయ సిగ్నేచర్ అపార్ట్‌మెంట్ నుంచి చైతన్య కళాశాల వరకు గల నాలాను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలా విస్తరణ పనులు త్వరలోనే చేపడుతామన్నారు. నాలా పై స్లాబ్ నిర్మాణం లేకపోవడంతో చుట్టు పక్కల కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యను త్వరలోనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాలా పై స్లాబ్ నిర్మాణ పనులు చేపట్టడంతో కాలనీవాసులకు విముక్తి కలుగుతుందన్నారు. నాలాలోని చెత్తాచెదారాన్ని తొలగించి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, చందానగర్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



దీప్తీశ్రీనగర్‌లో నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

హెచ్‌సీయూ క్యాంపస్‌లో 'ఆజాదీ ర్యాలీ'



కాగడాలతో ఆజాదీ ర్యాలీ నిర్వహించిన దృశ్యం

రాయదుర్గం: దేశంలో అమలు చేస్తున్న విద్యను, రాజ్యాంగాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ 'ఆజాదీ ర్యాలీ'ని నిర్వహించారు. స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఎఫ్ఐ) హెచ్‌సీయూ శాఖ ఆధ్వర్యంలో శనివారం రాత్రి క్యాంపస్‌లో కాగడాలతో ర్యాలీని నిర్వహించారు. హెచ్‌సీయూలోని ఎల్‌హెచ్–10 హాస్టల్ నుంచి సౌత్ షాపింగ్ కాంప్లెక్స్ వరకు కాగడాలతో ఈ ర్యాలీ కొనసాగించారు. భారతదేశంలో రాజ్యాంగాన్ని, విద్యావ్యవస్థను, భారత దేశాన్ని కూడా కాపాడాలని డిమాండ్ చేస్తూ ఈ ర్యాలీ కొనసాగించారు. అనంతరం భారతదేశాన్ని, రాజ్యాంగాన్ని, విద్యా వ్యవస్థను కాపాడాలని కోరుతూ గీతాలను కూడా ఆలపించారు. ఎస్ఎఫ్ఐ హెచ్‌సీయూ విభాగం కార్యదర్శి మోహిత్, అధ్యక్షుడు సోహెల్, యూనియన్ ప్రధాన కార్యదర్శి క్రిప, సీఈసీ సభ్యుడు శివ పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కాలనీవాసులు

హఫీజ్‌పేట్: ఆరోగ్యమే మహా భాగ్యమని ఫ్రెండ్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఇంజినీరింగ్ ఎన్‌క్లేవ్‌లోని కమ్యూనిటీ హాల్ సిటిజన్ హాస్పిటల్ సౌజన్యంతో ఫ్రెండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారిన జీవనశైలిలో పర్యావరణంలో వస్తున్న అనేక మార్పుల వల్ల వివిధ రకాల వ్యాధులకు గురవుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ నిత్య వ్యాయామం, మెడిటేషన్, యోగా, ధ్యానం, నడక, పండ్లు, పాలు, పాలఉత్పత్తులు, చేపలు, కోడిగుడ్లు, తృణధాన్యాలు, డ్రై ఫ్రూట్స్ వంటి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కాలనీలోని సుమారు 102 మందికి వైద్యులు తహా, అక్షయ డెంటల్ డాక్టర్ శివ, ప్రతినిధులు జాకీర్ హుస్సేన్, హరీష్ వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆంజనేయ రాజు, కరుణాకర్ గౌడ్, చంద్రశేఖర్, ఫ్రెండ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు విష్ణు ప్రసాద్, జనార్దన్, శివరామిరెడ్డి, అమ్మయ్య చౌదరి, రామిరెడ్డి పాల్గొన్నారు.

గచ్చిబౌలి–కొండాపూర్ రోడ్డులో రాకపోకలు షురూ



గచ్చిబౌలి: గచ్చిబౌలి–కొండాపూర్ రోడ్డులో రెండు వైపులా వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రాడిసన్ హోటల్ వరకు లెవల్–2 ఫ్లై ఓవర్ నిర్మాణంలో భాగంగా కొద్ది నెలల క్రితం గచ్చిబౌలి జంక్షన్ నుంచి కొండాపూర్‌కు వెళ్లే మార్గాన్ని ట్రాఫిక్ పోలీసులు మూసి వేసిన విషయం తెలిసిందే. ఫ్లై ఓవర్ పిల్లర్ల నిర్మాణం వేగంగా చేపట్టడంతో కొద్ది రోజుల క్రితం సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ హర్షవర్ధన్ గచ్చిబౌలి జంక్షన్ నుంచి కొండాపూర్ వైపు వాహనాల రాకపోకలకు అనుమతించారు. తాజాగా కొండాపూర్ నుంచి వాహనాలను గచ్చిబౌలి జంక్షన్‌కు అనుమతించినట్లు గచ్చిబౌలి ట్రాఫిక్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

ఫ్రీ లెఫ్ట్‌లో ప్యాచ్ వర్క్

గచ్చిబౌలి: నిత్యం వాహనాల రద్దీతో జంక్షన్లు జామ్ అవుతున్నాయి. ప్రధాన కూడళ్లలో గుంతలు ఉండటంతో ఫ్రీ లెఫ్ట్‌లో వాహనాల రాకపోకలు సాఫీగా సాగడం లేదు. దీంతో రోడ్ల మరమ్మతులకు ట్రాఫిక్ పోలీసులు నడుబిగించారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని విప్రో జంక్షన్‌లో గుంతలు ఉండటంతో ఫ్రీ లెఫ్ట్‌లో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీసులు చొరవ తీసుకొని గుంతల్లో కాంక్రీట్‌తో ప్యాచ్‌వర్క్ చేశారు. గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్ ఎదురుగా రాంకీ రోడ్డుకు వెళ్లాలంటే గుంతలు ఎక్కువగా ఉండటంతో రాకపోకలు అంతరాయం కలుగుతోంది. గుంతలు ఉన్న చోట బీటీ నిర్మాణం కోసం ఇప్పటికే మెటల్ వేశారు. బీటీ పనులు పూర్తయితే ఫ్రీ లెఫ్ట్‌లో వాహనాలు సాఫీగా వెళ్లేందుకు వీలుంటుంది.



విప్రో జంక్షన్‌లో కాంక్రీట్‌తో గుంతలు పూడ్చిన దృశ్యం



రాడిసన్ హోటల్ ముందు బీటీ రోడ్డు నిర్మాణంలో భాగంగా మెటల్ వేసిన దృశ్యం

మెరుగైన సేవలు అందిస్తాం

పటాన్‌చెరు: పటాన్‌చెరు మండలం ముత్తంగి పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనం పనులను ఆదివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవనం పూర్తయితే రైతులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉపేందర్, పాక్స్ చైర్మన్ బిక్షపతి, నాయకులు శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, యాదయ్య, డైరెక్టర్లు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అక్కా చెల్లెళ్ల కూచిపూడి రంగప్రవేశం



మాదాపూర్: అమెరికాలో పుట్టిపెరిగినప్పటికీ కూచిపూడి శాస్త్రీయ సంప్రదాయ నృత్యాన్ని అభ్యసించిన అక్కా చెల్లెళ్లు జెనిత, మాల్యద తొలు ప్రదర్శన ఇచ్చి సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం కూచిపూడి రంగ ప్రవేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. దీపాంజలి స్కూల్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ కూచిపూడి ఆధ్వర్యంలో నాట్య గురువు తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్ గురువు దీపికారెడ్డి మార్గదర్శకంలో శిష్యరికం పొందారు. ఇందులో గణదీపం, తక్కువేమి మనకు, థిల్లానా, వంటి సంగీతంపై నృత్యం చేశారు. గాత్రం దండిబొట్ల శ్రీనివాస వెంకట శాస్త్రి, మృదంగం రాజగోపాలచార్య, ఫ్లూట్ మురళీ, వయోలిన్ సాయికుమార్ సంగీత సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు జస్టిస్ విజయ్ సెన్‌రెడ్డి, డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి, ప్రదర్శనను తిలకించారు.

ఘనంగా శాస్త్ర సంగీత సాహిత్య సమ్మేళనం



శిల్పారామంలో అలరించిన కూచిపూడి నృత్యాంశాలు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో వెంపటి లక్ష్మి శ్రీనివాస శాస్త్రి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంపటి లక్ష్మీనారాయణ శర్మ ఆధ్వర్యంలో శాస్త్ర సంగీత సాహిత్య సమ్మేళనం తొమ్మిదవ వార్షికోత్సవ సంబురాలు ఆదివారం నిర్వహించారు. వేదవతి ప్రభాకర్ శిష్య బృందంచే సంగీత లయ విన్యాసంలో భాగంగా రమ్య, తేజస్వీ పాటలను ఆలపించారు. చావలి బాలాత్రిపురసుందరి శిష్యబృందంచే కూచిపూడి నృత్యప్రదర్శనను ప్రదర్శించి అలరించారు. వసంత, స్వరజతి, బృందావన నిలయే, దేశభక్తి గీతం తదితర అంశాలను సౌమ్య, శ్రీయ, శశికళ, వైష్ణవి, అనన్య, అనురిత, ఇషితా, వెంకట్ దీక్షితులు ప్రదర్శించి అలరించారు. ఈ కార్యక్రమానికి శాస్త్రవేత్త డాక్టర్ కోమల్‌కపూర్, మాధవపెద్ది సురేష్, కళా బ్రహ్మ శిరోమణి డాక్టర్ వంశీరామరాజు వేదవతి ప్రభాకర్‌లు పాల్గొని కళాకారులను ఘనంగా సన్మానించారు.

ఓటరు నమోదుపై అవగాహన

రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీ కాలనీలో ఆదివారం ఓటర్ నమోదు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆగస్టు 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఫాం 6, 8 ద్వారా దరఖాస్తు చేసుకునే విధానంపై కాలనీవాసులకు వివరించారు.

చెరువు నిండుగా.. పల్లె పచ్చగా

- నీటితో కళకళలాడుతున్న చెరువులు
- పెరిగిన సాగు విస్తీర్ణం

జిన్నారం(పటాన్‌చెరు): ఈ ఏడాది వర్షాకాలం పుష్కలంగా వర్షాలు కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సాగు నీటికి ఇబ్బంది లేకపోవడంతో ఉత్సాహంగా సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. గ్రామాల్లో చిన్న చిన్న చెరువులు కూడా నిండడంతో ఇంతకాలం పడావుగా ఉన్న భూములు కూడా ప్రస్తుతం సాగులోకి వచ్చాయి. గతంతో పోలిస్తే ఈ ఏడాది 500 ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరిగింది. జిన్నారం మండలంలో రైతులు ఎక్కువగా వరి పంట సాగు చేస్తారు. గుమ్మడిదల మండలంలో 600 ఎకరాల్లో సాగైనట్లు అధికారులు చెబుతున్నారు. గుమ్మడిదల మండలంలో ప్రస్తుతం వరి 6వేల ఎకరాలు, పత్తి 410 , మొక్కజొన్న 2,400, కందులు 225 ఎకరాల్లో, జిన్నారం మండలంలో వరి 5,500 ఎకరాల్లో సాగవుతున్నాయి. పత్తి, మొక్కజొన్న, కంది పంటలు ఎక్కువగా గణనీయంగా పెరిగింది. గుమ్మడిదల మండలం కానుకుంట, కొత్తపల్లి, నల్లవల్లి, రాంరెడ్డిబావి, నాగిరెడ్డిగూడెం, గుమ్మడిదల, జిన్నారం మండలంలోని సోలక్‌పల్లి, జిన్నారం, నల్తూర్, అండూర్, కొడకంచి, శివానగర్, వావిలాల గ్రామాల్లో పంటలు సాగు చేస్తున్నారు.

కొడకంచి గ్రామంలో చెరువు కింద సాగైన వరి



అన్ని కులాలకు బీసీ బంధు ఇవ్వాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

పటాన్‌చెరు టౌన్: బీసీలోని అన్ని కులాలకు బీసీ బంధు ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్ అన్నారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమంలో బీసీల పాత్ర ఎంతో ఉందని, 133 కులాలు ఉంటే కేవలం 13 కులాలకు వారికి మాత్రమే బీసీ బంధు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు నాగరాజు యాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంబాబు, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సుజాత, ఓబీసీ మోర్చా నియోజకవర్గ కన్వీనర్ జగదీష్, పటాన్‌చెరు మండల అధ్యక్షుడు నరేందర్ గౌడ్, అసెంబ్లీ బీజేవైఎం కన్వీనర్ రాజగోపాల్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆదిత్య, బలరాం తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఫుట్‌పాత్, సైకిల్‌ట్రాక్ పనులు



రాయదుర్గం: మోడల్ కారిడార్‌కు మరిన్ని సొబగులుదిద్దే పనులు చురుగ్గా సాగుతున్నాయి. నానక్‌రాంగూడ ఔటర్ రింగు రోడ్డు అండర్ బ్రిడ్జి నుంచి ఖాజాగూడ, ప్రశాంత్ హిల్స్, మధురానగర్ మీదుగా దాబా కూడలి వరకున్న రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్, సైకిల్‌ట్రాక్ నిర్మాణం చేస్తున్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో రూ.10 కోట్ల నిధులతో ఈ నిర్మాణాలు చేస్తున్నారు. నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసేందుకు ఉన్నతాధికారులు, జోనల్ కమిషనర్, సర్కిల్ అధికారుల ఆదేశంపై సర్కిల్ ఈఈ శ్రీనివాస్, డీఈ విశాలాక్షి, ఏఈ జగదీష్ ఆధ్వర్యంలో వర్క్‌ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ పర్యవేక్షణలో ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

యజమానితో గొడవల వల్లే..

యువతి ఆత్మహత్యకు కారణాలు వెల్లడించిన పోలీసులు



బిందుశ్రీ (ఫైల్)

గచ్చిబౌలి: ల్యాంకోహిల్స్‌లో 21వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన బిందుశ్రీ.. యజమానితో గొడవపడి ఈ అఘాయిత్యానికి ఒడిగట్టిందని పోలీసులు తెలిపారు. శనివారం తెల్లవారు జామున ఆత్మహత్యకు పాల్పడిన బిందు శ్రీ(28) అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. ల్యాంకోహిల్స్‌లో 15 ఎల్‌హెచ్ 2104లో నివాసం ఉండే పూర్ణచంద్‌కు పదేళ్ల క్రితం కాకినాడకు చెందిన బిందుశ్రీ పరిచయమైంది. మూడేళ్ల క్రితం పూర్ణచంద్ ఇంట్లో పనిమనిషిగా చేరింది. పూర్ణచంద్‌కు కొంతకాలంగా బిందుశ్రీతో వివాహేతర సంబంధం ఉంది. ఆ క్రమంలోనే ఇద్దరి మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే శనివారం తెల్లవారుజామున కూడా ఇద్దరి మధ్య గొడవ ప్రారంభమైందన్నారు. హాల్‌లోకి వచ్చిన బిందు శ్రీ బిగ్గరగా అరవడం..పూర్ణచంద్ చులకనగా మాట్లాడటంతో బిందుశ్రీ కిందికి దూకి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. యజమాని కొద్దిరోజుల క్రితమే మరో పనిమనిషిని తీసుకొచ్చినట్లుగా తెలుస్తోంది. యువతి ఆత్మహత్య కేసులో పూర్ణచంద్ పాత్ర ఉందని, అరెస్ట్ చేస్తామని సీఐ మహేష్ తెలిపారు.